## ● మూగ వేదన..పట్టదా..?



మాన్యాపూర్‌లో అధ్వానంగా దర్శనమిస్తున్న నీటితొట్టె

వర్షాలు ఆశించిన స్థాయిలో కురిసిన ఎండతీవ్రతకు నార్నూర్, గాదిగూడ మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. వాగులు, వంకల్లో నీరు ఎండిపోవడంతో అటవీ ప్రాంతాల్లో మూగజీవులకు తాగునీరు దొరకక అగచాట్లు పడుతున్నాయి. మేతకూ వెళ్లిన పశువులు తాగునీటి కోసం తంటాలు పడుతూ దాహార్తిన్ని తీర్చుకుంటున్నాయి. కనీసం నీటితొట్టెలు ఏర్పాటు చేసిన చోట నీరు నిల్వ ఉంటే పశువులకు సౌకర్యంగా ఉంటుంది. నీటితొట్టెలు లేని గ్రామాల్లో సంబంధిత శాఖ అధికారులు స్పందించి నిర్మాణం చేపట్టి పశువులకు నీటి సౌకర్యం కల్పించాలని పశుపోషకులు కోరుతున్నారు.

-నార్నూర్, ఏప్రిల్ 7

## ● మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ



మిషన్ భగీరథ పైపులైన్ నుంచి వృథాగా పోతున్న నీరు

దస్తురాబాద్‌లో మిషన్ భగీరథ పైపులైన్ లీకై నీరు వృథాగా పోతున్నది. నీరంతా పక్కనే ఉన్న రహదారిపైకి చేరింది. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

– దస్తురాబాద్, ఏప్రిల్ 7

# అభివృద్ధి పనుల హడావుడి

- గడువు ముగిసినా..
- 50 శాతం పూర్తికాని పనులు
- నాసిరకం ఇసుకతో నిర్మాణాలు



దిలావర్‌పూర్‌లో సీసీ రోడ్డు వేస్తున్న కూలీలు

దిలావర్‌పూర్, ఏప్రిల్ 7 : దిలావర్‌పూర్ మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు గాను మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 86 పనులకు ప్రతిపాదనలు పంపారు. అందులో నుంచి అన్ని పనులకు ప్రభుత్వం 2023–24 ఆర్థిక సంవత్సరం మార్చి 31వ తేదీ ముగింపునకు గాను మొత్తం రూ.2 కోట్ల 86 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు గుర్తించిన పనుల్లో భాగంగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు.

### హడావుడిగా పనులు...

గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను సంబంధిత కాంట్రాక్టర్లు పదికాలాల పాటు నాణ్యతతో ఉండాల్సినవి హడావుడిగా చేసి చేతులు దులుపుకున్నారు. సీసీ రోడ్లపై కట్టలు కట్టకుండా తూతూ మంత్రంగా క్యూరింగ్ చేసి పనులు పూర్తి చేశారు. పనులు ప్రారంభ సమయంలో సంబంధిత అధికారులు పర్యవేక్షించలేదని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

### గడువు ముగిసే..పనులు నిలిచిపోయే...

ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నిధులు గడువు ముగిసే నాటికి గ్రామాల్లో 50 శాతం పనులు కూడ పూర్తికాలేదు. మొత్తం 86 పనులకు గాను వివిధ గ్రామాల్లో రూ.5 లక్షల నుంచి 10 లక్షల లోపు పనులు 38 శాతం పూర్తి చేశారు. మిగతా పనులు గడువులోగా ప్రారంభించాలనే లక్ష్యంతో 27 పనులను ప్రారంభించి చేతులు దులుపుకున్నారు. మిగతా 24 పనులకు గడువు ముగియడంతో నిధులు వెనక్కి వెళ్లిపోయాయని సంబంధిత శాఖల అధికారులు తెలిపారు.

### నాసిరకం ఇసుకతో పనులు ...

గ్రామాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం ద్వారా మంజూరైన పనులకు సమయం తక్కువగా ఉండడంతో అటవీ ప్రాంతంలోని ఒర్రెలు నుంచి ఇసుకను తీసుకువచ్చి పనులు చేపట్టారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక గురించి అనేక మంది ఇది ఇసుకనా మొరమాని వారు ఆశ్చర్యపోయారు. పనులు చేపడుతున్న సమయంలో పర్యవేక్షించకపోవడంతోనే సంబంధిత కాంట్రాక్టర్లు తమకు ఇష్టం వచ్చినట్లు పనులు చేశారు.

### అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాం

ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించారు. ఇసుక గురించి చిన్నచిన్న సమస్యలు వచ్చిన పరిశీలించి దాని స్థానంలో కొత్త ఇసుకతో పనులు చేయించినాం. పనులు పూర్తిగా నాణ్యతతో చేపట్టారు. పనులు జరుగుతున్నప్పుడు పరిశీలించాం.

- శివకృష్ణ, పీఆర్ ఏఈ, దిలావర్‌పూర్

## ఎత్తిపోతల పథకాలపై రైతులకు అవగాహన



వన్నెల్(కే) గ్రామానికి తరలిన ఎమ్మెల్యే, రైతులు

భైంసా, ఏప్రిల్ 7: ముథోల్ నియోజకవర్గం రైతాంగం సాగునీటిపై మరింత అవగాహన ఉండాలన్న ఉద్దేశంతో ఎమ్మెల్యే రామారావు పటేల్ నేతృత్వంలో రైతులు నందిపేట మండలం వన్నెల్(కే) గ్రామానికి తరలివెళ్లారు. అక్కడి గ్రామ రైతులు ఎత్తిపోతల పథకం వినియోగించుకుంటున్న తీరును ఎమ్మెల్యే రైతులకు వివరించారు. ప్రతి సంవత్సరం రెండు పంటలు తీస్తూ అక్కడి రైతులు ఆదర్శంగా నిలవడంతో మన ప్రాంతానికి చెందిన దాదాపు 150 మంది రైతులు వాహనాల్లో తీసుకెళ్లారు.

## ఎండు మిర్చికి ఫుల్ డిమాండ్



ఖానాపూర్ వారసంతలో ఎండు మిర్చి

ఖానాపూర్ రూరల్, ఏప్రిల్ 7 : ఖానాపూర్‌లోని అంగడిబజారులో వారానికి రెండు సార్లు నిర్వహించే వారసంతలో ఎండుమిర్చికి గిరాకీ పెరిగింది. సీజన్ ప్రారంభంలో ధర అధికంగా ఉండి ప్రస్తుతం కాస్త తగ్గడంతో డిమాండ్ ఉంది. ఈ వారసంతలో ధర ఎక్కువగానే ఉండడంతో నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి రైతులు ఎండుమిర్చిని అమ్మకానికి తీసుకువస్తున్నారు. క్వింటాల్‌కు రూ.15 వేల నుంచి 25 వేల వరకు పలుకుతున్నది. సన్నం రకం ఎండు మిర్చికి కిలోకు రూ.180 నుంచి 250 వరకు, దొడ్డురకం ఎండు మిర్చికి కిలోకు రూ.150 నుంచి 300 వరకు పలుకుతున్నది. దూర ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి ఎండు మిర్చిని కొనుగోలు చేస్తున్నారు.

## ఆటో బోల్తాపడి ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు



భరత్‌కుమార్ (ఫైల్)

జైనథ్, ఏప్రిల్ 7 : జైనథ్ మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ నుంచి జైనథ్ వైపు వెళ్తున్న ఆటో తర్నం బ్రిడ్జి వద్ద శనివారం రాత్రి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న భరత్‌కుమార్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పుష్ప, పద్మకు గాయాలై రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. సంఘటనా స్థలాన్ని సీఐ సాయినాథ్ పరిశీలించారు. మృతుని అన్న సుభాష్ ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ జక్కుల్వార్ రికేశ్ పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. ఆటో సీజ్ చేసినట్లు తెలిపారు.

## జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

సారంగాపూర్, మార్చి 7 : నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలం బీరవెల్లి గ్రామానికి చెందిన షేక్ ఇసా(45) ఆదివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..షేక్ ఇసా కొంతకాలం మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో నైలాన్‌తాడుతో ఉరేసుకున్నాడు. ఈ మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## అనాథ పిల్లలకు ఆర్థిక సాయం

దిలావర్‌పూర్, ఏప్రిల్ 7 : సాంగ్వి గ్రామానికి చెందిన నిమ్మ లక్ష్మీభోజన్న దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూతురు అక్షయ పదో తరగతి, కుమారుడు అజయ్ ఏడో తరగతి చదువుకుంటున్నారు. తండ్రి రెండు సంవత్సరాల క్రితం దుబాయిలో చనిపోగా, తల్లి మూడు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందింది. దీంతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు కూతురిని దిలావర్‌పూర్‌లోని కేజీబీవీలో చేర్పించారు. తన తాత వద్ద మనుమడు ఉంటు చదువుకుంటున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న కంజర్ గ్రామానికి చెందిన యువకులు వారికి అండగా ఉండాలనే ఉద్దేశంతో ఆదివారం వారి ఊరికి వెళ్లి రూ.17401 నగదును అందజేసి మానవత్వం చాటుకున్నారు.

## 10 నుంచి జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

భైంసా, ఏప్రిల్ 7 : నియోజకవర్గంలోని రైతాంగానికి ప్రభుత్వం ద్వారా మద్దత ధర కల్పించేందుకు ఈ నెల 10వ తేదీ నుంచి జొన్న కొనుగోలు కేంద్రాలు అధికారులు ప్రారంభిస్తారని ఎమ్మెల్యే రామారావు పటేల్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాల్‌కు రూ.3180 ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

## ఉపాధి హామీ కూలీ రూ.600కు పెంచాలి

బాసర, ఏప్రిల్ 7: ఉపాధి హామీ కూలీ రూ. 600లకు పెంచి 200 రోజుల పని దినాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు డిమాండ్ చేశారు. ఆదివారం బాసరలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, సీఐటీయూ జిల్లా నాయకుడు పోశెట్టి పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ఖానాపూర్, ఏప్రిల్ 7: విద్యానగర్ కాలనీలోని నిరుపేద కుటుంబానికి చెందిన వడ్ల రాము గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో 1990–91 బ్యాచ్ పదో తరగతి మిత్రులు ఆదివారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించి రూ. 25వేల ఆర్థిక సాయం అందజేశారు. మెరుగైన చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో పదో తరగతి మిత్రులు డాక్టర్ కృష్ణం రాజు, గుగ్గిళ్ల రాజేందర్, గణేశ్, బుచ్చన్న, శ్యాం, వెంకటప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన కవి సమ్మేళనం




సమ్మేళనంలో పాల్గొన్న కవులు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 7: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఐత్యారం ముచ్చట్లు ఆధ్వర్యంలో కవి సమ్మేళనం కార్యక్రమం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ రచయిత ఉదారి నారాయణ అధ్యక్షతన వహించారు. పలువురు కవులు వినిపించిన కవితలు ఎంతోగాను ఆకట్టుకున్నాయి. నిర్వాహకులు లక్ష్మీనారాయణ, నాగోరావ్, ప్రశాంత్, కవులు రాఘవేంద్ర, రాజు, సాయిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

బాసర, ఏప్రిల్ 7 : కిర్గుల్(కే) గ్రామంలో కేంద్రీయ సహకార సంఘం బిదరెల్లి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం అధికారులు ప్రారంభించారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర ఏ గ్రేడ్ రకానికి రూ. 2203, సాధారణ రకానికి రూ. 2183 పొందాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం, వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

## ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసుల పూజలు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 7: మండల కేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో ఆదివాసీ గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం ఏజెన్సీలోని ఆయా మండలాల నుంచి ఆదివాసీ గిరిజనులు కుటుంబ సమేతంగా ఆలయానికి తరలివచ్చారు. ఆలయ అవరణలో నైవేద్యాలు వండి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.
NT-311821-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## ప్రశాంతంగా ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష



బోథ్‌లోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సీఎస్ ఉమేశ్‌రావు

బోథ్, ఏప్రిల్ 7: బోథ్‌లోని ఆదర్శ పాఠశాలలోని ఆరో తరగతిలో ప్రవేశం కోసం ఆదివారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఉమేశ్‌రావు తెలిపారు. పరీక్ష రాసేందుకు 295 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 268 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. 27 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఏడు నుంచి పదో తరగతిలో ఖాళీల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 200 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. కేంద్రం డీవోగా సునీల్‌కుమార్ వ్యవహరించారు.

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 7: ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రాష్ట్ర మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహించిన ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు 1416 మందికి గాను 1276 మంది విద్యార్థులు హాజరయ్యారు. 140 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం ఏడు నుంచి పదో తరగతిలోని ఖాళీ సీట్లకు నిర్వహించిన పరీక్షకు 1064 మంది విద్యార్థులకు గాను 936 మంది హాజరయ్యారు. 128 మంది గైర్హాజరయ్యారు.

## ప్రపంచ శాంతి కోసం కృషి చేయాలి

ఎదులాపురం, ఏప్రిల్ 7 : ప్రజల్లో ఆధ్యాత్మిక, ధ్యాన చైతన్యాన్ని నింపేందుకు ఆధ్యాత్మిక, ధార్మిక సంస్థలు ఒకే వేదికగా పని చేయాలని శ్రీ రామచంద్ర మిషన్ జోనల్ కోఆర్డినేటర్లు షరీఫ్, కృష్ణరావ్ పిలుపునిచ్చారు. ఆదిలాబాద్ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శ్రీ రామచంద్ర మిషన్, హార్ట్‌ఫుల్ నెస్ సంస్థ ఆధ్వర్యంలోఆదివారం ఆధ్యాత్మిక సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. అన్ని మతాలు, ధార్మిక సంస్థలు ప్రపంచ శాంతి కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కోఆర్డినేటర్లు షరీఫ్, కృష్ణరావ్

## అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలి

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 7: అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన ఇంద్రవెల్లిలో నిర్వహించే అంబేద్కర్ జయంత్యుత్సవాలకు దళిత బహుజనులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ ప్రధానకార్యదర్శి కామ్‌రాజ్ వాగ్మారే, మండల నాయకులు సునీల్, శివాజీ, ఆచారే దత్తా, ముకాడే ఉత్తమ్, నాగ్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

దస్తురాబాద్, ఏప్రిల్ 7 : మండలంలోని గొడిసేర్యాల ఎక్స్‌రోడ్డు వద్ద ఆదివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు. పోలీస్ సిబ్బంది రవి, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

## నంబర్ ప్లేట్స్ లేని 25 వాహనాలు సీజ్



నంబర్ ప్లేట్స్‌లేని సీజ్ చేసిన వాహనాలతో ఎస్ఐ సునీల్

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 7: మండల కేంద్రంలో ఎస్ఐ సునీల్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్స్‌లేని 25 వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు లక్ష్మణ్, భీంరావ్, పోలీసులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

ఎదులాపురం, ఏప్రిల్ 7: జిల్లాలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ సూచించారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని ప్రధాన కూడలిలో ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ అధ్యక్షుడు ఆదిత్య ఖండేష్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

## సైనిక్ పాఠశాల ప్రవేశ పరీక్ష

ఇచ్చోడ, ఏప్రిల్ 7 : మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ పాఠశాలలో ఆదివారం ఉదయం నిర్వహించిన సైనిక్ పాఠశాల ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 248 మంది విద్యార్థులకు గాను 202 మంది హాజరయ్యారు. 46 మంది గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన సెషన్–2(ఇంటర్మీడియట్)ప్రవేశ పరీక్షకు 152 మంది విద్యార్థులకు గాను 119 మంది హాజరయ్యారు. 33 మంది గైర్హాజరయ్యారని ఆర్‌సీవో గంగాధర్ తెలిపారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి




మాట్లాడుతున్న డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 7: ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ రాబోయే లోకసభ ఎన్నికల్లో తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలని డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు సూచించారు. ఆదివారం ఆదిలాబాద్‌లోని అంబేద్కర్ చౌక్ వద్ద స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాకారులు ఓటు ప్రాముఖ్యతపై వివరించారు. 18 ఏళ్లు నిండిన యువత ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పట్టణ వాసులు పాల్గొన్నారు.

## దుండగులను పట్టుకోవాలి



ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

బాసర, ఏప్రిల్ 7 : విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను త్వరగా పట్టుకొని కఠినంగా శిక్షించాలని ఆదివారం బాసర గ్రామస్తులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని శ్రీ చింతామణి గణేశ్ ఆలయం వద్ద ఉన్న శివాలయంలో నంది నాగేంద్రుడి విగ్రహాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## ముస్లింలకు రంజాన్ పవిత్ర మాసం



నిర్మల్ చైన్‌గేట్: ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎస్పీ

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్7: ముస్లింలకు రంజాన్ పవిత్రమైన మాసమని నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని నిర్మల్ జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ముస్లిం పోలీస్ సిబ్బంది వారి కుటుంబ సభ్యులకు ఆదివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు చేస్తూ అల్లాహ్‌ను ప్రార్థిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీ కాంతిలాల్, ఏవో యోనస్ అలీ, సీఐలు, ఆర్ఐలు, డీపీవో, సూపరింటెండెంట్లు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ఉట్నూర్, ఏప్రిల్ 7: మండల కేంద్రంలో సీనియర్ నాయకుడు సయ్యద్ కరీం ఆధ్వర్యంలో ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనలో పాల్గొని ముస్లింలకు ఖజూర తినిపించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, పట్టణ ప్రముఖులు, పలు పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రూ.72,500 నగదు పట్టివేత

జైనథ్(బేల), ఏప్రిల్ 7 : బేల మండలంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఆదివారం వాహనాల తనిఖీల్లో భాగంగా రూ.72,500 పట్టుకున్నట్లు ఎస్ఐ రాధిక తెలిపారు. మహారాష్ట్ర నుంచి బేల వైపునకు వస్తున్న వాహనదారుడి వద్ద ఎలాంటి పత్రాలు లేనందున ఆ నగదును సీజ్ చేసి ఎఫ్ఎస్‌సీ టీం బృందం సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా రూ.50 వేలకు పైగా నగదు తెచ్చుకుంటే విధిగా ధ్రువపత్రాలను వెంట పెట్టుకోవాలని సూచించారు.



బేల అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వద్ద నగదు పట్టుకున్న ఎస్ఐ రాధిక

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677